## క్షణంలో సగం

ఒక సాయంత్రం (వాడిపేరు చెప్పను)

కనబడ్డాడు. "బయల్దేరు" అన్నాడు. ఎక్కడకని అడిగి లాభం లేదు వాడితో. హఠాత్తుగా ఇలాగే ఎన్నోసార్లు కనబడి ఏవో ప్రతిపాదనలుచేస్తూ ఉంటాడు. నేను మారుమాట లేకండా వాటిని శిరసావహిస్తూ ఉంటాను. "అనుభవం జ్ఞానానికి జనకుడు" అంటే నేను నమ్మను. అలాగే "అవసరం సృష్టికి జనని" అనే సుభాషితంలో కూడా నాకు నమ్మకంలేదు. అంటే పూర్తిగా నమ్మకం లేదనాలి. ఇవన్నీ సగం సత్యాలు కాబట్టి సగం సగం మాత్రమే నమ్ముతాను.

ఇద్దరం బయల్దేరిన తర్వాత వీడు (ఎవరి పేరైతే చెప్పదలుచుకోలేదో వాడు) "ఇప్పుడు మనం లక్షాధికారులం కావడం ప్రారంభిస్తున్నాం. తక్షణమే! జోరుగా నడు" అన్నాడు. ఇద్దరం తక్షణం ప్రారంభించాం. కాని ఆ ప్రారంభం యిప్పటికీ ప్రారంభదశలోనే ఉండిపోయింది. అప్పుడు బయల్దేరిన మేము ఇంకా బయల్దేరుతూనే వున్నాం.

* * *

ఈ సాయంత్రం ఇక్కడ ఈ నగరంలో........సముద్రంలాంటి ఎడారిలాంటి ఆకాశంలాటి సముద్రంలాంటి ఎడారిలాంటి ఎడారి, సముద్రంలాంటి ఎడారి, ఆకాశంలాంటి ఎడారి, ఏకసక్కెంలాంటి ఎడారి....

ఇక్కడ ఈ నగరంలో ట్రాంలో నేను...ఎదురుగుండా సెలూన్‌లో అద్దంలో నేను; అదైనా క్షణంలో సగంసేపు!

అదీ అసలు సంగతి. ట్రాంలో వెళ్ళుతున్న నేను సెలూన్‌లో అద్దంలో క్షణంలో సగంసేపు నన్ను నేను ప్రతిబింబించి నాకు నేను కనిపించాను. క్షణంలో సగంసేపు ఒకేసారి సెలూన్‌లోనూ ట్రాంలోనూ నివసించాను.

ఇక్కడ ఈ సాయంత్ర....

ఎడారిలో ఆకాశంలో క్షణంలో సగంలో ట్రాంలో సెలూన్‌లో జనం మధ్య సముద్రం మధ్య జనసముద్రం మధ్య నేను.

ఇక్కడ ఈ నగరంలో ఈ క్షణంలో సగంసేపు ఏమిటి జరుగుతోంది?

"మనం లక్షాధికారులం కావడం ఎప్పుడు ప్రారంభిస్తాం" అని ప్రశ్నించేడు నైనకన్ను. వాళ్ళిద్దరూ నాయరు దుకాణంలో నిన్నటి పకోడీలు నములుతున్నారు.

"ఇదిగో ఈ క్షణం" అన్నాడు దొరసామి.

"టీ తీసుకున్న క్షణం."

"డబ్బులు చాలుతాయా" అన్నాడు నైనకన్ను నాయరు రెండు గ్లాసులతో టీ తెచ్చి—వాళ్ళ ముందుంచి పోయాడు.

"గుర్రాలు మోసంచేశాయని చెబుదాం. అరువుంటాడు నాయరు." అన్నాడు దొరసామి.

* * *

అక్రమ లాభాలమీద అదనపు పన్ను తగ్గింపు.అర్థిక పరిస్థితి మీద కేంద్ర ప్రభుత్వపు దండయాత్ర. ఇతోధిక కృషి. ద్రవ్యోల్బణము. దాని నరికట్టుటకు ఆరు మార్గాలు. రామ పాదాల పీత నడక. అన్ని వేళలూ తేనీటి వేళలే.

* * *

కాకెమ్మ చక్కని చుక్క. నిజంగా ఆ పేరుకి తగ్గది కాదు. పదేళ్ళ కిందట మరీ బాగుండేది. అప్పుడు సినిమాలో నటించడాని కిక్కడకి వచ్చింది. ఒక కెమెరా మనిషి ఆమె శరీరాన్ని అనేక కోణాలనుంచి చూసి చవిచూసి 'నువ్వు మంచం మీదకే కాని తెరమీదకి పనికిరా' వన్నాడు. దరిమిలాను చాలామంది ఆ అభిప్రాయాన్ని స్థిరపరిచారు. ఇప్పుడు కాకెమ్మ ఇంకో మంచం మీదకి వెళ్ళబోతూంది.

* * *

దశవర్ష ప్రణాళిక బుట్టదాఖలా. బంగారం ధర పడిపోవడంవల్ల బ్యాంకులికి మూడురోజులు సెలవు. ఈ రాత్రి చంద్రుడు నూటికి 75 వంతుల నష్టంతో వ్యవహరిస్తాడు. అనుకోని గుర్రాల ఆకస్మిక విజయం.

* * *

జమీందారు సొంతకారు నడుపుకుంటూ జోరుగా పోతున్నాడు. స్వరాజ్యం వచ్చిన తర్వాతనో అంతక్రితం రెండునెలల పూర్వమో జమీందారు జాతీయమతం తీసుకుని దీక్షావస్త్రాలు ధరించాడు. పేవ్‌మెంటు మీద నడుస్తున్న కుర్రాడు జమీం

దారును చూశాడు. కుర్రాడి జేబులో వేడి వేడి వేరుశనగపప్పుంది. పిడికిటినిండా వేరుశనగపప్పు తీసుకుని పట్టుకున్నాడు.

కద్దరు దుస్తులతో కనుపండువుగా కనబడుతూన్న జమీందారుని వేరుశనగ పప్పుతో అభిషేకించాలన్న ఆశ ఆ కుర్రాడి మనస్సులో మెరుపులాగ మెరిసింది. కాని ఒక నిశ్చయానికి రాలేకపోయాడు. కారు జోరుగా దాటిపోయింది.

*　　　*　　　*

జగద్విఖ్యాతి వహించిన షేక్స్పియరు మహాకవి నాటకం హేమ్లెట్. మనస్సు స్థిరపరచుకోలేకపోయిన మానవుని విషాదాంత గాథ.

"ఉప్మా పట్రా" అన్నాడు. పట్టుకొచ్చాడు అయ్యర్వాళ్. తింటున్నవాడు తెమ్మన్నవాడు. అందులో రెండు రాళ్లున్నాయి. కాఫీ తీసుకోకండానే బిల్లు తీసుకుని డబ్బు చెల్లిస్తూ "ఉప్మాతోబాటు రెండు రాళ్లు ఎక్కువగా ఇచ్చాడు. అంచేత వాటికి నా యథాశక్తి ధర రెండర్ధణాలు ఒక అణా చెల్లిస్తున్నా"నని అణా ఎక్కువ ఇవ్వబో యాడు. నేతాజీ విలాస్ కాఫీక్లబ్బు (ఇక్కడ పదార్థాలు కల్తీ లేని నేతితో చెయ్య బడవు) ప్రొప్రయిటరు అణావైపు అతి భయంకరంగా చూశాడు.

"ఎవరైనా బిచ్చగాడికి ధర్మం చేసుకో" అన్నాడు. రాళ్ళధర చెల్లించదలుచు కున్న మనిషి అణాకాసుని జేబులో వేసుకుని రెండు అయిదురూపాయల నోట్లు బిల్ల మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"వెర్రి వెధవ" అనుకున్నాడు ప్రొప్రయిటరు, రూపాయినోట్లను దాచేస్తూ.

ఆ సమయంలోనే ఒక అణాకాసు అడుక్కునే అమ్మి డబ్బాలో పడ్డ చప్పు డయింది.

*　　　*　　　*

"కమ్యూనిస్టులను పాతేస్తున్నాం" అన్నారు దొరతనం వారు. పాతేస్తున్నారు. వానలు కురిస్తే దేశం అంతటా కావలసినంత పంట.